హైదరాబాద్ వార్త





ఆషాడ మాస బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచే కాకుండా నగరం నలుమూల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనం, తొట్టెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోల్కొండ జగదాంభిక అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగవ పూజను నిర్వహించి బోనం సమర్పించారు.





# భక్తులతో పోటెత్తిన గోల్కొండ కోట

**భక్తిశ్రద్ధలతో గోల్కొండ జగదాంభిక అమ్మవారికి నాలుగవ పూజ**

**అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనం, తొట్టె సమర్పణ**



మెహిదీపట్నం, జులై 2, ప్రభాతవార్త : వివిధ ప్రాంతాల నుంచి బోనాలు, తొట్టెల ఊరేగింపులతో పాటు పోతురాజుల విన్యాసాలతో గోల్కొండ కోటకు భక్తులు పెద్ద ఎత్తున తలరివస్తుండడంతో గోల్కొండ పరిసర ప్రాంతాలన్ని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో గోల్కొండకోట భక్తులతో పొటెత్తింది. రంగారెడ్డి జిల్లా జడ్జి హర్చ, ఆర్డీఓ చంద్రకళలు బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్ సబ్జిమండి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలు, భారీ తొట్టెల, అదే విదంగా షేక్‌పేట్ ప్రాంతం నుంచి బోనాలు, భారీ తొట్టెలను పోతురాజుల విన్యాసాల నడుమ గోల్కొండ కోటకు తీసుకొచ్చి సమర్పించారు. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆరెల్ల జగదీష్ యాదవ్, కమిటీ సభ్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కిలో టమాట @రూ.160

**మళ్లీ పెరుగుతున్న టమాట ధరలు**

**పొరుగు రాష్ట్రాల నుంచి తగ్గిన దిగుమతి**

**బహిరంగ మార్కెట్‌లో కిలో టమాట ధర రూ.160**



హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త: టమాట ధరలు మళ్ళీ పైపైకి ఎగబాకుతున్నాయి. రాష్ట్రంలో సాగు తగ్గడం,పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్‌లలో కిలో120నుంచి 140 పలుకుతుండగా.. బహిరంగమార్కెట్‌లో రూ.160 అమ్ముతున్నారు. నెమ్మదినెమ్మదిగా పెరిగిన ధరతో టమాట కొనలేని పరిస్థితి ఏర్పడుంతుంది. రాష్ట్రంలో టమాట అధికంగా సాగుచేసే మెదక్,రంగారెడ్డిజిల్లాలో ప్రస్తుతం సాగు తగ్గిపోయింది. ఈజిల్లాల్లో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాల్లో భారీ క్షీణత ఏర్పడింది. దీంతో ఈజిల్లాల నుంచి మార్కెట్‌లోకి టమాట రావడం లేదు. దీంతో ఏపీలోని మదనపల్లి నుంచి, కర్ణాటకలోని కొలార్,చిక్‌మంగళూర్ నుంచి దిగుమతి అయ్యే టమాటలపై ఆధారపడాల్సి వస్తోంది. అక్కడ నుంచి సైతం దిగుమతి తగ్గింది. మదనపల్లి మార్కెట్‌లో కొన్ని రోజులుగా ధరలు పుంజుకుంటున్నాయి. దిగుమతి తగ్గడంతపాటు సీజన్ ప్రారంభం కావడంతోఇతర రాష్ట్రాల నుంచి టమాట మార్కెట్‌లో 100టన్నుల నుంచి 120 టన్నుల వరకే వస్తోంది.

తెలంగాణ ప్రాంతంలో టమోటా పంట కాలం చివరకి వచ్చింది. ఎండలకు పంటలు ఎండిపోయాయి. దీంతో నగరానికి ఆంధ్రాతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదే కారణమని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. పంట కాలంలో కూడా నగరానికి అవసరమైన సరుకులో 60శాతం బయటనుంచే తెస్తున్నారు. మిగతా 40శాతమే మనరాష్ట్రంలో లభ్యమౌతుంది. కానీ వేసవి వచ్చేసరికి అమాంతం 15శాతానికి సరఫరా పడిపోయింది. దీంతో 85శాతం వరకు ఇతర రాష్ట్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి దిగుమతులు పెరగాల్సిన అవసరం ఉంది. గత ఏడాది ఇదే సమయంలో రాజస్థాన్ నుంచి పెద్దసంఖ్యలో టమాటా రాష్ట్ర మార్కెట్‌లోకి వచ్చింది. ప్రస్తుతం అక్కడి నుంచి తక్కువగా వస్తోంది. ఈదిగుమతులు మరింత పెరిగితే ధరలు కొంత తగ్గే అవకాశం ఉంటుందని, లేనిపక్షంలో మరో నెలపాటు ధరల్లో పెరుగుదల తప్పదని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం





తండ్రి శివకుమార్, పిల్లలు నిఖిల్, నిత్య

ధర్నాచౌక్, జులై 2, ప్రభాతవార్త: తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఒక తండ్రి కనిపించకుండా పోయిన ఘటన దోమల గూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడలోని భీమామైదాన్‌లో నివసించే ఏ.శివకుమార్(35) తొమ్మిది సంవత్సరాల క్రితం విజయ (30)తో వివాహం జరిగింది. వారికి నిఖిల్ (7), నిత్య (6నెలలు) వయసుగల ఇద్దరు పిల్లలు ఉండగా. శివకుమార్ ఒక జిమ్‌లో కోచ్‌గా పనిచేసేవాడు. శివకుమార్ తరచుగా భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. గత నెల 28వ తేదీ భార్యతో గొడవపడి బలవంతంగా భార్యతో విడాకుల పత్రాలపై సంతకం పెట్టించుకుని ఇంటి నుండి పంపివేశాడు. పిల్లలను తీసుకుని విజయ తన అక్క ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జూన్ 30వతేదీ విజయకు శివకుమార్ ఫోన్‌చేసి, కౌన్సిలింగ్ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాలని పిలిచాడు. పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ అనంతరం ఇద్దరూ ఇకపై మంచిగా ఉందామని నిర్ణయించుకుని ఇంటికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం మళ్లీ శివకుమార్ భార్యతో గొడవపడి పిల్లలను తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన భర్త కాసేపాగి వస్తాడని ఎదురుచూస్తూ ఉన్నప్పటికీ పిల్లలతో వెళ్లిన భర్త తిరిగి రాలేదు. తెలిసిన స్నేహితులు, బంధువులను విచారించినప్పటికీ భర్త, పిల్లల ఆచూకీ తెలియకపోవటంతో శనివారం దోమలగూడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. శివకుమార్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**హోంమంత్రి మహమూద్ అలీ**



హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మహిళలు

చార్మినార్,జులై 2 ప్రభాతవార్త : మైనార్టీల అభ్యున్నతి కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు.పాతబస్తీ తలాబ్ చంచలం బిఆర్ఎస్ అధ్యక్షులు రజాఅలీ మీర్జా ఆధ్వర్యంలో పాతనగరానికి చెందిన మహిళలు ఆదివారం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్బంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్నదని,ప్రజలు సంక్షేమ పథకాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ లాయక్ అలీ,తలాబ్ చంచలం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు రజాఅలీ మీర్జా,తలాబ్ చంచలం డివిజన్ కాన్టెస్ట్ అభ్యర్ధి ఎస్.నస్రీస్ బాను,బిఆర్ఎస్ నాయకులు నాదెర,నస్రీన్ బేగం,నాదెర బేగం,సాజిద్ అలీ,అబ్బాస్ హుస్సేన్,అక్రం అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గురు పౌర్ణిమ సందర్బంగా దుప్పట్లు పంపిణీ



గురు పౌర్ణిమ సందర్బంగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్

చార్మినార్,జులై 2 ప్రభాతవార్త : గురు పౌర్ణిమ సందర్భంగా ఆదివారం చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ సోచ్ అనాధ ఆశ్రమంలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఆధ్యాత్మికత జ్ఞానాన్ని బోధించటంతో పాటు అజ్ఞాన చీకట్లను జ్ఞాన కాంతులతో పారదోలే దివ్య చైతన్య స్ఫూర్తి గురువు అని తెలిపారు.సనాతన భారతీయ సంప్రదాయంలో గురువుకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని ఆయన తెలియజేశారు.అనాద పిల్లలను ఆదుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన తెలియజేశారు.

## యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామికి మొక్కుబడిని సమర్పించిన ఎమ్మెల్యే



స్వామి వారి కానుకలను అర్చకులకు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జులై2 ప్రభాతవార్త: తెలంగాణ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, రెండవ తిరుపతిగా పిలువబడే యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామికి ఆదివారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు,మాధవరం కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ కిలో బంగారం విలువ చేసే నగదును మొక్కుబడిగా సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల తరపున ఈ మొక్కును చెల్లించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులచే ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### తాటి మైసమ్మ దేవాలయంలో వైభవంగా బోనాల జాతర

చార్మినార్, జులై 2 ప్రభాతవార్త : చార్‌మహల్ రజక సంఘం ఉపాధ్యక్షులు ధామర నర్సింగరావు,ప్రధాన కార్యదర్శి శాపురాం రవి,కోశాధికారి ఆండోల్ బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సిటీ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ తాటి మైసమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు జరిగాయి.ఈ సందర్భంగా చార్‌మహల్ రజక కమిటి తరుపున పలువురిని శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి.శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర రజక సంఘం చైర్మన్ కృష్ణమూర్తి, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నర్సింహ పాల్గొన్నారు.

## సేవా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న వారితో చైతన్య వేదిక ప్రతినిధులు

హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త: ముదిరాజ్ చైతన్య వేదిక అధ్యక్షులు శివ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పండుగ సాయన్న సేవాపురస్కారాలు, ఈఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణలోని వివిధ రంగాల్లో సమాజానికి సేవలందిస్తున్న ముదిరాజ్ ప్రతిభా మూర్తులకు, ఆరద్య మహిళలకు చైతన్య వేదిక ఆధ్వర్యలో అవార్డులు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ ఏఊరికి వెళ్ళినా ముదిరాజ్ లేని కులం లేదని, ముదిరాజ్‌లు సామాజికంగా ఎదుగుతున్నా.. రాజకీయంగా ఎదగడం లేదన్నారు. ఏపార్టీలో ఉన్న ముదిరాజ్ బిడ్డ నిలబడ్డ చోట అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అందే బాబయ్య ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, కోడి నారాయణ, కోట్ల పుష్పలత, సిరవేన స్వప్న ముదిరాజ్, జయరమేష్, కుంజర్ల రమేష్, మామిళ్ల రాజన్న, అందె బాబయ్య, నగేష్, సంజు ముదిరాజ్, నగేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల కోసం ఎన్ని నిధులైనా వెనుకాడేది లేదు

**మంత్రి తలసాని**



మోండా డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పోరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్, జులై 2 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ మోండా డివిజన్ పరిధిలోని మారేడ్‌పల్లి మనోహర్ థియేటర్, మారుతీ వీధి ప్రాంతాలో ₹ 2.66 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ,వి.డి.సిసి రోడ్డు పనులను మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్‌లతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెనుకాడ బోదన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వ మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు లాస్య నందిత, ఆకులరూప హరిక్రిష్ణ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహ్మ ముదిరాజ్, సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సంతోష్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ బత్తుల నారాయణ, బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, నాగులు,రాములు,జయరాజు, కాశిరెడ్డి, అశోక్, బిజెపి నాయకులు కొంతం నరేశ్, జిహెచ్ఎంసి, జలమండలి ఇంజనీర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో రికార్డు

**40 కోట్లు దాటిన ప్రయాణికులు**

హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త : మెట్రో రైలు చరిత్ర సృష్టించింది. 2017 నవంబరు 29 మెట్రో రైలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 40 కోట్ల మంది ప్రయాణించారని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 4.90లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. మరికొన్ని రోజుల్లో ఈ సంఖ్య 5లక్షలు దాటుదుందన్నారు. రోజుకు 6.70 లక్షల మంది ప్రయాణం చేసేందుకు అనుగుణంగా మెట్రో రైళ్ల అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దాదాపు 1000 ట్రిప్పులు తిరుగుతున్నట్లు అంచనా వేశారు.ప్రస్తుతం ప్రతి రోజు 1.20లక్షల మంది విద్యార్థులు, 1.40 లక్షల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మెట్రో జర్నీ చేస్తున్నారని తెలిపారు.

## అద్భుతమైన ప్రతిభ కలిగిన సాన్వికి బాల పురస్కార్ అవార్డు ఇవ్వాలి

**చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి**



భగవద్గీతలోని 700 శ్లోకాలను అనర్గళంగా వల్లెవేసే సాన్విని అభినందిస్తున్న చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి

నార్సింగి, జులై 2 ప్రభాతవార్త : భగవద్గీతలోని 700 శ్లోకాలను అనర్గళంగా వల్లెవేస్తూ, ఆధ్యాత్మిక మేధావులను సైతం అబ్బుర పరుస్తున్న అద్భుత ప్రతిభ కలిగిన సాన్వికి బాల పురస్కార్ అవార్డు-2024ను ఇవ్వాలని చేవెళ్ల ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం సాన్వి ప్రతిభను పరిశీలించి, సన్మానించిఅభినందించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో ఉంటూ 9.వ,తరగతి చదువుతున్న సాన్వి జమాల్‌పూర్ భగవద్గీత శ్లోకాల పఠనంలో అనేక అవార్డులు అందుకుంది. కిరణ్‌బేడీ నుంచి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ అవార్డును, గణపతి సచ్చిదానంద స్వామి నుంచి బంగారు పతకంను, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ అందుకుంది. గీతా జ్ఞాన జ్యోతి బిరుదును అందుకుంది. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ సాన్వికి బాల పురస్కార్ అవార్డు ఇవ్వాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానిని కోరుతానని, మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వగానే నా సొంత డబ్బుతో సాన్విని ఢిల్లీకి పిలిపించి మంత్రిని కలిపిస్తానని స్పష్టం చేశారు. ఇంత చిన్న వయసులోనే జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం చాలా అరుదు అని తెలిపారు. ఇలాంటి జీనియస్ చిన్నారులను గుర్తించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సరైన గుర్తింపునిస్తూ, ప్రోత్సహిస్తే మరింత అద్భుతమైన ప్రతిభ వెలికి వస్తుందని ఎంపి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపిని కలిసిన వారిలో బిఆర్ఎస్ సీనియర్ నేత మద్దెల ప్రేమ్‌కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## చింతల్‌మెట్‌లో చెప్పుల వ్యాపారి దారుణ హత్య

మైలార్‌దేవ్‌పల్లి, జులై 2 ప్రభాతవార్త : ఓ చెప్పుల వ్యాపారిని కొంత మంది కలిసి చింతల్‌మెట్‌లో అతి దారుణంగా హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన ఖలీల్ ఉల్లా (24) చెప్పుల వ్యాపారి. పహాడిషరీఫ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఉస్మాన్ పాత నేరస్థుడు. సయ్యద్ ఉస్మాన్, ఖలీల్ ఉల్‌ల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. పాతకక్షలు కారణంగా జూలై ఒకటివ తేదీ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సయ్యత్ ఉస్మాన్‌తో పాటు మరి కొంత మంది కలిసి చెప్పుల వ్యాపారి ఖలీల్ ఉల్‌పై దాడి జరిపి అతి దారుణంగా హత్య చేశారు.ఖలీల్ ఉల్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన ఖలీల్ ఉల్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని పోలీసులు ఖలీల్ ఉల్ కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును అత్తాపూర్ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## సాయి అమృత వర్షిని పుస్తకంను ఆవిష్కరించిన డిప్యూటీ మేయర్ శ్రీలత



తార్నాక, జులై 2 ప్రభాతవార్త: గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయిబాబా భక్తులు, శ్రీ నీలకంఠ మహదేవ్ స్వామిజీ రచించిన శ్రీ సాయి అమృత వర్షిని పుస్తకాన్ని ఆదివారం తార్నాకలోని గణేష్ టెంపుల్ ఆలయంలో గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డిలు ఆవిష్కరించారు.

## నగరంలో భారీ వర్షం

హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త : నైరుతి రుతుపవనాల ప్రభావంతో నగరంలో ఆదివారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జూబ్లీహిల్స్, కొండాపూర్, హైటెక్‌సిటీ, మాదాపూర్, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, అబిడ్స్, కోఠి, ఫిల్మ్‌నగర్, మోహదీపట్నం, అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.లింగంపల్లి, గచ్చిబౌలి, చందానగర్, షేక్‌పేట్, మణికొండ, రాయదుర్గం, గోల్కొండలో వర్షం పడింది. ఖాజాగూడ, షేక్‌పేట్ మార్గంలో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదలడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పాడ్డాయి.చైతన్యపురి, ఎల్బీనగర్, నాగోల్, బోడుప్పల్, వనస్థలిపురం, నాంపల్లి, అబిడ్స్, బషీర్‌బాగ్, నారాయణగూడ, ఖైరతాబాద్, అఫ్జల్‌గంజ్, గోశామహల్, ఎంజే మార్కెట్ ప్రాంతాల్వో వర్షం పడింది. గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్లన్ని చెరువులను తలపించాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట, ప్రగతినగర్, మూసాపేట, బాచుపల్లి, కెపిహెచ్‌బికాలనీ, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కొంపల్లి, సూరారం,షాపూర్‌నగర్, చింతల్, జగద్గిరిగుట్ట, మల్కాజ్‌గిరిలో వర్షం కురిసింది. వర్షం కారణంగా రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దింతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరోవైపు రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది.

## మోడీ సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 9 ఏళ్ళ పాలనలో సాధించిన ప్రతి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి పోలింగ్ బూత్‌స్థాయి వరకు తీసుకువెళ్ళాలని హిమాయత్‌నగర్ డివిజన్ బిజెపి నాయకులకు ఆమె విజ్ఞప్తి చేశారు. దేశాన్ని ప్రగతి పథంలో నడించడం నరే ంద్రమోదీకే సాధ్యమని, ప్రపంచదేశాలలో భారతదేశం పేరు తారస్థాయికి చేరుకుందని ఆమె తెలిపారు. ఆదివారం కార్పోరేటర్ డివిజన్ క్యాంప్ కార్యాలయంలో బిజెవైఎం అధ్యక్షుడు ఎ.సాయికుమార్ అధ్యక్షతన జరిగిన కమిటి సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్‌లో ఏ బూత్ దస్ యూత్ నినాదాన్ని ప్రతిబూత్‌కు తీసుకువెళ్ళాలని, మోదీ సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సందీప్‌యాదవ్, కన్వీనర్ చక్రి పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుండిగల్, జులై 2 ప్రభాతవార్త: చెట్ల కొమ్మలను తొలగించుటకై 11కేవీ సుందరాశ్రమం, గాగిల్లాపూర్ ఫీడర్ పరిధి లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని విద్యుత్ అధికారులు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని దుండిగల్, నగ్లూర్‌గ్రామాల ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాని అధికారులు కోరుతున్నారు.

**నిజాంపేట్..** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33కేవీ బాచుపల్లి, ఎఫ్‌టీఓ2, ఎఫ్‌టీఓ3, 11కేవీ ఏసీ టైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జనీత్, ఇందిరానగర్ నుంచి బాచుపల్లి సిగ్నల్, ఫ్లైఓవర్ వర్క్స్ ప్రధాన రహదారిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ ఉండదు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## అన్ని విధాలా అండగా ఉంటాను



సురేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

జీడిమెట్ల, జులై2 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప గౌడ సంఘం నూతన లెటర్ హెడ్‌ను ఆదివారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సంఘం సమావేశాలు నిర్వహించడానికి కమిటీ హాల్ నిర్మాణంకై స్థలం కేటాయించాలని సురేష్‌రెడ్డికి గౌడ సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సురేష్‌రెడ్డి సంఘానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, గౌడ సంఘానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా త్వరలోనే సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కూడా స హకారమందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య మహముని గౌడ సంఘం అధ్యక్షుడు ఎంఎస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నేడే పద్మభూషణ్ డా. సినారె 92వ జయంతి మహోత్సవం

నాంపల్లి, జులై 2 ప్రభాతవార్త : విశ్వవిఖ్యాత మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి 92వ జయంతి మహోత్సవం ప్రముఖ సాంస్కృతి, సాహిత్య సంస్థ రసమయి ఆధ్వర్యంలో ఈరోజు 3వ సోమవారం బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో రాత్రి 6గంటల నుండి వైభవోపేతంగా వివిధ ప్రతిష్టాత్మక కార్యక్రమాలతో నిర్వహించనున్నట్లు జవహర్ బాలభవన్ పూర్వ సంచాలకుడు, సంస్థ అధ్యక్షుడు డా. ఎం.కె.రాము మీడియాకు తెలిపారు. పద్మభూషణ్ డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభాధ్యక్షతన డా. ఎం.కె.రాము నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి, విశిష్ట అతిథులుగా పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. తిరుమల శ్రీనివాసాచార్య, డా. జె.చెన్నయ్య తదితరులు పాల్గొని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిని ఘనంగా సత్కరించి డా. సినారె పురస్కారం ప్రదానం చేస్తారని తెలిపారు. సభకు ముందు జరిగే ముఖ్యమైన సాంస్కృతిక కార్యక్రమాల్లో డా. సినారె రచనలో ప్రజాదరణ పొందిన గీతాల గానం; డా. ఎం.కె.రాము రచించిన డా. సినారె నృత్యగీత ప్రదర్శనలుంటాయని, అధికసంఖ్యలో డా. సినారె అభిమానులు, సాహితీవేత్తలు, సినీసంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాలను ఆస్వాదించి విజయవంతం చేయాలని డా. ఎం.కె.రాము కోరారు.

### ఎంఎస్.రామారావు జయంతి ఉత్సవాలు

చిక్కడపల్లి, జులై 2 ప్రభాతవార్త: తెలుగు చలనచిత్రరంగంలో మొట్టమొదటి నేపధ్యగా యకుడు, అభినవ తులసీదాస్ సుందరదాస్ ఎంఎస్.రామారావు జయంతి ఉత్సవాలను సోమ వారం ఘనంగా నిర్వహించబోతున్నట్లు శ్రీ సుందరదాస్ ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ పి.శ్రీనివాస్ వివరించారు. చిక్కడపల్లిలోని ఎంఎస్.రామారావు స్ట్రీట్‌లో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిం చడంతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

### చెట్లకొమ్మల తొలగింపు

చిక్కడపల్లి, జులై 2 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని త్యాగరాయ గానసభ సమీపంలో ప్రమాదకరంగా మారిన భారీ వృక్షాలకు సంబంధించిన కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆదేశాల మేరకు డిఆర్‌ఎఫ్ బృందం ఆదివారం చేపట్టారు. స్థానికులు కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకు మార్ పర్యవేక్షణలో విద్యుత్తు శాఖ, డిఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ఎక్కడైతే ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను కొద్దిసేపు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బిజెపి నేతలు కృష్ణ చతుర్వేదుల, ప్రశాంత్, వేణు, సతీష్ పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యను పరిష్కారించాలని అధికారులను ఆదేశించిన కార్పోరేటర్

హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త: గోల్నాకలోని ఆలీకేఫ్ చౌరస్తా నుంచి శ్రీరామ్‌నగర్ వైపు వెళ్ళె దారిలో డ్రైనేజీ నిండిపోయి పొంగిపొర్లుతున్నది. ఈ సమస్యను పరిష్కారించాలని స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఆదివారం అధికారుల కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అనంతరం అధికారులు డ్రైనేజీ పనులను చేపట్టడం జరిగింది.

## గురుపరంపర సాంప్రదాయం కొనసాగాలి

మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాలచారి



పురస్కారాలను ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, జులై 2 ప్రభాతవార్త: భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, గురువుని శిష్యులు ఆ శిష్యులు గురువుగా మారిన తర్వాత వారిని వారి శిష్యులు గౌరవించుకోవాలనే గురు పరంపర సంప్రదాయం కొనసాగాలని మాజీ కేంద్రమంత్రి, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళవేదికలో కనకదుర్గ నృత్యవిభావరి సంస్థ నిర్వహణలో 'గురుపౌర్ణమి' వేడుకలు వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగింది. నాట్యగురువు, నిర్వాహకురాలు నిర్మల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వేణుగోపాలచారి కథక్ కళాక్షేత్ర అధినేత పండిట్ అంజుబాబు, ఆచార్య వనజా ఉదయ్, పద్మ కళ్యాణ్, సంగీత గురువు శ్రీవల్లీ శర్మలను సత్కరించారు. ఇదే కార్యక్రమంలో గురువు నిర్మల ప్రభాకర్‌ను ఆమె శిష్యులు 50 మందిపై సత్కారం చేశారు. యువకళావాహిని స్థాపకుడు వైకె.నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని సత్‌గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సత్యవోలు రాంబాబుకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కుసుమ కమలారత్నం మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పిఎంకె.గాంధీ వ్యవహరించారు.

### బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

మెహిదీపట్నం, జులై 2, ప్రభాతవార్త : బోనాల ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కారోరు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం కార్వాన్ సబ్జిమండి ఆధ్వర్యంలో బోనాలు, తొట్టెల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూగంగానగర్‌లోని కనకదుర్గా దేవాలయం నుంచి భారీ తొట్టెల, మహంకళి దేవాలయం నుంచి పోతురాజుల విన్యాసాలతో ప్రారంభమైన తొట్టెల ఊరేంపు భక్తజనసందోహం నడుమ గోల్కొండ కోటకు చేరుకుంది. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను గంగపుత్ర సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి బహుమతిని అందజేశారు. కార్యక్ర మంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఆనందేశి విజయ్ కిశోర్, ప్రధాన కార్యదర్శి అంబటి విజయ్ ఆనంద్, గోల్కొండ పూజా కమిటీ అధ్యక్షులు అల్లె వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గుడుమని చంద్రకాంత్, చిలుకూరి బాలాజీ దేవాలయ అర్చకులు రంగరాజన్ పాల్గొన్నారు.

### నిరుపేద మహిళల జీవితాల్లో భరోసా కల్పించాలి

సైఫాబాద్, జులై 2 ప్రభాతవార్త: నిరుపేద మహిళల జీవితాల్లో భరోసా కల్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని చైత్రం అకాడమీ డైరెక్టర్ స్రవంతి రంగవర్ఝుల చెప్పారు. పేద మహిళలు సరైన విద్య, వైద్యంకు నోచుకోక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి ఆరోగ్యం మెరుగు కోసం కూడా స్వచ్ఛంద సంస్థలు, డాక్టర్లు సహకరించాలని కోరారు. శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద వృద్ధ మహిళలకు ఉచితంగా బ్లాకెట్స్ పంపిణి చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్, ప్రముఖ విద్యావేత్తలు ఆర్.కళ్యాణ్, వెంకటరామయ్య, ప్రముఖ సాహితీ వేత్త సతీష్‌గుప్తా పాల్గొన్నారు.



రాంగోపాల్‌పేట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్ ఇంటినుండి మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడానికి బయలుదేరిన జోగిని శ్యామల, చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

### దొంగలించిన సొత్తు స్వాధీనం



నిజాంపేట్, జులై 2 ప్రభాతవార్త: చోరీకి గురైన నగలను స్వాధీనం చేసుకొని నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రీన్ అవె న్యూ విల్లాస్‌లో నివాసం ఉంటున్న బీవీవీ సత్యనారాయణ అనారోగ్య సమస్యల కారణంగా తన స్వగ్రామమైన తూర్పు గోదావరి జి ల్లాకు గత నెల 24న వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. అయితే సత్యనారాయణ పని మనిషిని పిలిచి ఇంటిని శుభ్రంగా ఉంచాలని, మొక్కలకు నీటి పట్టాలని తెలిపి ఇంటి తాళాలు ఇచ్చి వెళ్ళాడు. 30వ తేదీన ఇంటికి వచ్చిన సత్యనారాయణ సుమారు 15లక్షల రూ పాయలు విలువ చేసే బంగారు ఆభరణాలు దొంగలించబడినవని గుర్తించి బాచుపల్లి పోలీసులకు పని మనిషిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పని మనిషి వెంకట లక్ష్మీ(38)ని విచారించి ఇంటిని సోదా చేసి ఆభరణాలను స్వాధీనం చేసుకొని నిందితురాలిని అదుపు లోకి తీసుకున్నారు.

### బిజెపి నుంచి బిఆర్ఎస్‌లోకి చేరిన బాగ్ అంబర్‌పేట నాయకులు



బిఆర్ఎస్ పార్టీలోకి చేరినవారికి కండవాలు కప్పుతున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జులై 2 ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాభివృద్ధికి, అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బాగ్ అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు, బిజెపి ఎడ్యుకేషన్ సెల్ ఇంఛార్జ్ చంద్రశేఖర్‌రావు అలియాస్ ట్యూషన్ శేఖర్, శశికాంత్, విజయ్‌కుమార్, కృష్ణ, రాజేష్ తదితరులు ఆదివారం గోల్నాక క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సిఎం కెసిఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఇందుకు ఆకర్షితులమై పార్టీలో చేరడం జరిగిందన్నారు. అంబర్‌పేటలో కాలేరు వెంకటేష్ తీరు బాగుందని, ఆయన చేస్తున్న అభివృద్ధి పనులకు అందరం ఆకర్షితులవుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం లో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రమోహన్, గెలవయ్య, శ్రీహరి, బాలరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు సన్మానం



జనప్రియ నగర్ కమ్యూనిటీ హాల్‌లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానిస్తున్న కమిటి సభ్యులు

యూసుఫ్‌గూడ, జులై 2, ప్రభాతవార్త : లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనప్రియ నగర్ కమ్యూనిటీహాల్‌లో వైద్యులను శాలువలతో, మెమోంటోలతో సత్కరించారు. సమాజంలో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రత్యేక గౌరవం ఉందని వారిని ప్రజలు దేవుల్లా కొలుస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు వెంకటరావు, రోనంకి జగన్నాధం, ఆదినారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మూసాపేట, జులై 2, ప్రభాతవార్త : ప్రజలకు సేవ చేయడంలో ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడు ముందుం టుందని ట్రస్ట్ అధినేత ప్రేమ్ కుమార్ వెల్లడించారు. ఆదివారం మూసాపేట వార్డు కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కుండా దేవయ్య పటేల్, రాష్ట్ర కార్యదర్శి తెల్ల హరికృష్ణ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం 9 డివిజన్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులను సైతం ఉచితంగా అందజేస్తామన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి స్వచ్ఛందంగా తమ సంస్థ ద్వారా ఆపరేషన్ సైతం చేయిస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో తమతోపాటు ముందుండి నడుస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్య వేదిక కన్వీనర్ బొశెట్టి నర్సింగరావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, మూసాపేట కో ఆర్డినేటర్ సప్పిడి వెంకటేష్, మేడ్చల్ జిల్లా సెక్రటరీ తూము శైలేష్ కుమార్, బీసీ ఐక్యవేదిక కో కన్వీనర్ గున్నాల వినోద్ కుమార్, హరిబాబు, తూము శ్రవణ్‌కుమార్, తూము విజయ్ కుమార్, జిల్లా మనోజ్, శ్రీకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ముషీరాబాద్‌లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం-ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జులై 2 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో తిరిగి బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ పరిధిలో స్థానిక బిఆర్ఎస్ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను యువనేత ముఠాజయసింహాతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, సీనియర్ నేతలు నేతా శ్రీనివాస్, ప్రవీణ్, కోకా రవి పాల్గొన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపైనే ఉందన్నారు.

## ఈనెల 16న విశాఖలో బిసిల మహాగర్జన

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య



ఛలో విశాఖ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు పెట్టాలని ,బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని ,బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని,జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న విశాఖలో బిసిల గర్జన సభను నిర్వహించన్నుట్లు జాతీయ బిసి సంక్షేమసంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు విద్యానగర్‌లో జాతీయ అధికార ప్రతినిధి ,ఢిల్లీ ఇంచార్జ్ కర్రీ వేణుమాధవ్, జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఛలో విశాఖ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కులగణన, బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లపై రాజ్యాంగబద్ధమైన హక్కులకై చర్చ జరపాలని కోరారు. ఇప్పటికే 8రాష్ట్రాల అసెంబ్లీ తీర్మాణాలు చేశాయని 16 రాజకీయ పఆర్టీలు మద్దతు పలికాయన్నారు. ఈపార్టీలు పార్లమెంట్‌ను స్థంభింపజేసి చిత్తశుద్ది నిరూపించుకోవాలని అన్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన వైఎస్ఆర్‌సిపి ,టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్‌లో బిసిబిల్లుకై కొట్లాడాలన్నారు ఇతర సమస్యలపై రోజు పార్లమెంట్‌లో ఉద్యమాలు చేస్తున్న మాదిరిగా కులగణనపై కూడా పార్లమెంట్‌లో చర్చ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కరూపాయి ఖర్చు లేకుండా జనగణన చేసే అవకాశం ఉన్నా బిసి వ్యతిరేఖవైఖరితో డిమాండ్‌ను అంగీకరించలేదని కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు బిసి కులగణనపై విధాన ప్రకటన జారీ చేయలేదన్నారు. విశాఖలో జరిగే సభను బిసిలందరూ విజయవంతం చేయాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు . ఈకార్యక్రమంలో వేముల రామకృష్ణ, బిసి వెంకట్, ఆళ్ల రామకృష్ణ, శ్రీనివాస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## సాయి చందు మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటు: జి.చెన్నయ్య



సాయి చందు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, జులై 2 ప్రభాతవార్త: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనదైన పాత్రను పోషించిన ఉద్యమకారుడు, కవి, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చందు అకాల మరణం పట్ల మాల ప్రజా సంఘాల జెఏసి కన్నీటి నివాళులు అర్పించింది. ఆదివారం స్ఫూర్తి భవన్‌లో జరిగిన సాయిచందు సంతాప సభలో ముఖ్యఅతిథిగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జెఏసి చైర్మన్ జి.చెన్నయ్య పాల్గొని మాట్లాడుతూ సాయిచందు అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకుపోయేవారిలో ఒక వ్యక్తిని, భవిష్యత్ తరాలు ఒక గొప్ప నాయకుడిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్‌తోపాటు, రాష్ట్రంలోని అనేక మంది పెద్దలు, ప్రజలకు సాయిచందు ప్రీతిపాత్రుడని జి. చెన్నయ్య కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్రను పోషించారని గుర్తు చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన జెఏసి వర్కింగ్ ఛైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లుతోపాటు, ఇతర వర్కింగ్ ఛైర్మన్లు కరణం కిషన్, గోపోజు రమేష్, పేరోజ్ మహేశ్వర్, మన్నె శ్రీధర్‌రావు, ఇందిరా, పుణ్యభానుప్రకాష్ తదితరులు మాట్లాడుతూ దళిత జాతి ఒక నిబద్దత కలిగిన గొప్ప వ్యక్తిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయి చందు మరణం దళిత బహుజనులకు తీరని లోటన్నారు. సాయి చందు కుటుంబానికి మాల ప్రజా సంఘాల జెఏసి ఎల్లవేళల అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగా శ్రీనివాస్, గాజుల నగరాజు, రాజలింగం, బైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జి.చెన్నయ్యతోపాటు అందరూ సాయిచందు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



కేఎస్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యూసుఫ్‌గూడ, జులై 2, ప్రభాతవార్త : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిం చేందుకు గాను బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిం చడం అభినందనీయ మని నియోజకవర్గం బిజెపి సినియర్ నాయకులు మాదవరం కాంతారావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ మహేందర్‌లు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కేఎస్ నగర్‌లో బిజెపి మేడ్చల్ జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. దాదాపు 200మంది వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. అవసర మయిన వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్, మేడ్చల్ జిల్లా మహిళా మోర్చ కార్యదర్శి పులిగోళ్ళ శ్రీలక్ష్మీ యాదవ్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, ధర్మారావు, కాయితీ యాదవరెడ్డి, గంగాధర్, బొంతు హరికృష్ణ, చిలకల కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, శ్రావణ్‌కుమార్, కళ్యాణ్, వేణు, అంకిత్, రాజ్‌కుమార్, సాయిచంద్, అభిషేక్, భాను, మోహన్‌రావు, కమ్మరి రామకృష్ణ, వెంకటేష్‌రెడ్డి, స్వాతి, పద్మ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం కృషి



సమావేశంలో పాల్గొన్న జిహెచ్ఎంసి కౌన్సిల్ బిజెపి విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తమిళనాడు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు లోగేంద్రన్

మైలార్‌దేవ్‌పల్లి, జులై 2 ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని జిహెచ్ఎంసి కౌన్సిల్ బిజెపి విప్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.కాటేదన్‌లోని బిజెపి పార్టీ కారా ్యలయంలో ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మహిళా మోర్చ అధ్యక్షురాలు ఉడుత లక్ష్మీ ఆధ్వర ్యంలో డివిజన్ మహిళా మోర్చ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి సమావేశంలో చర్చించటం జరిగిందని తెలిపారు.తమిళనాడుకు చెందిన మహిళా మోర్చ నాయకురాలు కరీనా, తమిళనాడు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు లోగేంద్రన్,మహిళా మోర్చ నాయకురాలు వి.లక్ష్మీ, శరణమ్మ,తిరుపతమ్మ,విమలమ్మ,నవనీత,సుధా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయ కమిటీ సమావేశం



మెహిదీపట్నం, జులై 2, ప్రభాతవార్త : కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయ కమిటీ సమావేశాన్ని ఆదివారం దేవాలయ ప్రాగణంలో చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ..ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా కార్వాన్ దర్బార్ మైసమ్మ – మహంకాళి మైసమ్మ దేవాలయ ఉమ్మడి బోనాల ఉత్సవాలను ప్రతి ఏడు మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

**IN THE COURT OF V SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT:AT: HYDERABAD**
**E. P. NO. 122 OF 2018**
**IN**
**O.S. NO. 972/2016**

BETWEEN:
SMT. K. USHA RANI
**... PETITIONER/ DHR**
**AND**
SRI K. NAGAIAH SETTY SINCE DIED REP BY LRS.,
**... RESP/ JDR**

To
1. Sri K. Nagaiah Setty, (since expired) As per L.Rs.
2. Smt. K. Nagarathnam, W/o. Late K. Nagaiah sertty, ,
3. Dr. K. Veenith, S/o. Late K. Nagaiah Setty,
Both are R/o. 3-5-930, Susheel wadi, Himayath nagar, Hyderabad
**...Proposed JDRs**

Sir,
Please take notice that the above named Petitioner/ DHR/ Plaintiff has filed the above suit for recovery of money and same was decreed and filed the above E.P. , In the said E.P. it was brought to the notice of the Hon'ble Court that the JDR died and you No. 2 being the wife and No. 3 being the Son of JDR are brought on record. The matter stands posted to **13.07.2023** for your appearance. If you fail to appear before the Hon'ble Court personally or through an Advocate on the said date at 10.30 a.m. the matter will be decided exparte.
(BY ORDER OF THE COURT)
**T.V.K.MURTHY,**
Advocate,
#103,#16-11-765, Sri Sai Priya Apartments, Moosarambagh, Hyderabad
**Cell No. 9848060700**

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL,HYDERABAD-II AT:HYDERABAD**
**CASE NO.O.A./ 704/2022**

Between:
Canara Bank
SME, Kukatpally Branch, Hyderabad
**...Applicant**
**AND**
M/s.Indus Water Solutions & Others
**...Defendants**

To,
Sri M.S.N.Reddy, S/o.Sri M.Venkata Reddy (D.3)
Partner of M/s.Indus Water Solutions, a/a Major,Occ:Business, R/o. Plot No.13, A.S.Raju Nagar, Near Raghava Reddy Function hall, Nizampet Road, Kukatpally, Hyderabad-500 072, Hyderabad-500 072 and Plot No.9, H.No.4-66, Somashila Township, Pashamylaram, Patancheru, Medak-502 307 (Now Sanga Reddy)

Whereas the OA No.704 of 2022 was listed before the Hon'ble Presiding Officer on 20.06.2023.
Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons/Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.1,23,20,049.69 Ps., (Rupees One Crore Twenty Three Lakhs Twenty Thousand Forty Nine Sixty Nine Paise Only).In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under:-(i) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted. (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application. (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties: (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and /or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal: (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank of Financial institutions holding security interest overy such assets. You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the **Registrar, on 3.8.2023 at 10:30 A.M.**failing which the application shall heard and decided in your absence. **Given under my hand and seal of this tribunal on this the 26th Day of June, 2023.**
**REGISTRAR,**
**DEBTS RECOVERY TRIBUNAL-II**
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.



నందిగామ మండలం తాటిగడ్డ తండాలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకుంటున్న స్నేహితులు

## పూర్వవిద్యార్థుల అపూర్వ సమేళనం

**నందిగామ జులై2,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తాటిగడ్డ తండాకు చెందిన బిఆర్ఎస్ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ,యంగ్ డైనమిక్ లీడర్ జెట్టావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో 2007 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు జరిపిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పండుగ వాతావరణాన్ని మరిపించింది. కొత్తూరు జడ్పిహైస్కూల్‌లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి మిత్రులు కలవడంతో పాటు ఆనాడు చదువుకున్న ఆడుకున్న ప్రదేశాలు జ్ఞాపకం చేసుకొని నేమరేసుకున్నారు. పూర్వపు స్నేహితులందరూ ఆప్యాయంగా పలకరించుకొని యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం అని ఒకరినోకరు ఆలింగనం చేసుకొని ఆనంద పరమశులైయ్యారు.స్నేహానికి గుర్తుగా లక్ష్మణ్ నాయక్ ఫాంహౌజ్‌లో మొక్కను నాటారు. ప్రాణ వాయువునిచ్చే మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని పూర్వపు విద్యార్థులు శపథం చేశారు. అనంతరం తాటిగడ్డ తండా నుండి మైసిగంటి అమ్మవారి దైవదర్శనం కోసం తరలివెళ్లారు.ఈ వేడుకల్లో పూర్వపు విద్యార్థులు దర్శన్,విష్ణు, చెన్నయ్య,శ్రీశైలం,బురాన్,రామక్రిష్ణ,రాఘవేందర్,సాయిక్రిష్ణ,సురేష్, రవి,ప్రవీణ్,వెంకటేష్,శివకుమార్,మహేష్,శిరాజ్,అబీద్,కమర్,సురేందర్,తదితరులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించిన జెట్టావత్ లక్ష్మణ్ నాయక్‌ను సన్మానించి ,విందు, వినోదాలలో మునిగి తెలారు. వేడుకల్లో ఎన్నం భూపతి రెడ్డి, నవాబ్‌పేట రాజశేఖర్ గౌడ్,ఈట సత్తయ్య,వార్డుమెంబర్,శ్రీను నాయక్,పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన చిన్ననాటి మిత్రులు



తాటిగడ్డ తండాలో మొక్కలు నాటుతున్న పూ్వ విద్యార్థులు

**నందిగామ జులై2,ప్రభాతవార్త :** ఆరోగ్యమే మహాభాగ్యమని.. .ప్రాణవాయువునిచ్చే మొక్కలను నాటితే అవి మన ప్రాణాలతో పాటు పశుపక్షాదులను,యావత్ జంతుజలాన్ని కాపాడుగల్లుతామని భావించి చిన్ననాడు చదువుకున్న విద్యార్థులు మొక్కలు నాటి అందరికి ఆదర్శమైయ్యారు.నందిగామ మండలం తాటిగడ్డ తండాలో ఆదివారం 2007 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి విద్యార్థులు కలిపి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని విందు వినోదాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అందరూ మిత్రులు అందులో మెముండాలనే ఆలోచనతోనే మొక్కలు నాటినట్లు చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా ఎంతో మందికి మేలు జరిగి ఆరోగ్యంగా ఉన్నారని అందులో భాగంగానే మొక్కలు నాటినట్లు జెటావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు.

## 9న ఆర్బినగర్‌లో బోనాల పండుగ : నరేందర్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

**శంషాబాద్ జులై2,ప్రభాతవార్త :** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఆర్.బి నగర్ 24,25వ వార్డులలో ఈనెల 9వ తేదిన బోనాల ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయించినట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్ తెలిపారు.కాలనీ ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలో అందరూ కలిసి ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం జరిగిందని ఆదివారం బోనాల ఊరేగింపు అమ్మవారికి బోనాల సమర్పణ సోమవారం ఘటాల ఊరేగింపు జరుగుతుందని ఆయన వివరించారు.అమ్మవారి దేవాలయ పరిసరాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు కోరుతూ తీర్మానించారు.స్థానిక కౌన్సిలర్లు దేవరంపల్లి పుష్పలత బుచ్చిరెడ్డి,కోనమోల్ల భారతమ్మ నరసింహులు ,కో ఆప్షన్ నెంబర్ సంతోష్ ప్రభాకర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోనమోల్ల శ్రీనివాస్,పాండురంగారెడ్డి,రాములు పరందాములు, గాజుల సురేష్,వెంకట్ రెడ్డి,అనోజ్,క్రాంతి కార్తీక్ సాయి, విజయ్, నరసింహ,ఆంజనేయులు,దేవరకొండ బుచ్చిరెడ్డి,భాను ,మహేష్, విట్టల్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్ గౌడ్,రమేష్,దర్శన్, మోహన్ రావు,లక్ష్మీపతి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై కేసు నమోదు

**శంకర్‌పల్లి, జులై 02 ప్రభాతవార్త:** మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి శంకర్‌పల్లి ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన 22 సంవత్సరాల రజనీకాంత్ గత కొన్నేళ్ల నుంచి వికారాబాద్ జిల్లా నవాబు పేట్ మండలంలోని ఓ గ్రామంలో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అదే సమయంలో 14 ఏండ్ల వయస్సు ఉన్న మైనర్‌బాలిక కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడని చెబుతున్నారు. ఆ మైనర్ బాలిక కుటుంబం రెండు నెలల కిందట శంకర్‌పల్లిలో ఇల్లు కొనుగోలు చేసుకున్నారు. ఇదిలావుంటే మూడు రోజుల కిందట ఆ బాలికను తీసుకెళ్లి రజినీకాంత్ వివాహం చేసుకున్నాడు. దీంతో చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ వివాహానికి సహకరించిన అందరిపైనా తగిన విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### సంబంధ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

**ఇబ్రహీంపట్నం, జులై 2, ప్రభాతవార్త:** సంబంధ వర్గాల సంక్షేమమే లక్ష్యంగ పనిచేస్తున్న కెసిఆర్ ప్రభుత్వ పనివిధానాలను చూసి కేంద్ర ప్రభుత్వం అవార్డులు, రివార్డులు ప్రకటిస్తుంటే కండ్లు మండి ఓర్వలేక చూడలేనివారు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ సికె కాన్వెన్షన్ హాల్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటర మణారెడ్డి,జిల్లా రైతు బంధు అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి,ఎంపిపి కృపేష్,మండల పార్టీ అధ్యక్షులు కొత్త కిషన్‌గౌడ్,బుగ్గరాములు,రమేష్‌గౌడ్,చీరాల రమేష్, నాయకులు ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు



సంపర్కు అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు



మంబాపూర్‌లో గడప గడపకు ప్రచారంలో పాల్గొన్న బిజేపి నాయకులు

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలి

**శంషాబాద్ జులై2,ప్రభాతవార్త :** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్,బుక్క వేణుగోపాల్ సూచించారు.బిజెపి చేపట్టిన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు పెద్దతుప్రా గ్రామ సర్పంచ్ చిటికెల వెంకటయ్య మండల బిజెవైఎం ఉపాధ్యక్షుడు జూకల్ ఎంపిటిసి సభ్యుడు బుక్క ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. నరేంద్రమోడీ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం దేశ భద్రత కోసం చేపడుతున్న పథకాలను కరపత్రాల రూపంలో ముద్రించి పంపిణీ చేశారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల నియమితుడైన బుక్క వేణుగోపాల్‌ను పార్టీ నాయకులు ,కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. బిజెపి నాయకులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గుర్రంపల్లి లక్ష్మయ్య,కొండా రాజ్ కుమార్,వడ్డే చంద్రయ్య, గండు రాజు,రాజేష్,నందు పాల్గొన్నారు.

**చెన్నారంలో ..**

**తలకొండపల్లి జులై2,ప్రభాతవార్త :** మహాజన్ సంపర్కు అభియాన్‌లో భాగంగా బూత్ స్వశక్తి కరుణ అభియాన్ బిజెపి కేంద్ర పార్టీ నిర్ణయం మేరకు తమిళనాడు నుంచి పనులను వీక్షించడానికి వచ్చిన షణ్ముఖ సుందర్ ఆది వారం తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో 24వ బూత్‌లో పనులు పర్యవేక్షణ చేశారు. చెన్నారం గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి నరేంద్ర మోడీ పథకాలను గడపగడపకు తీసుకుపోవాలని దిశ నిర్దేశం చేశారు.అదేవిధంగా గడపగడపకు పథకాల వివరించారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్,ప్రధాన కార్యదర్శి హరి కాంత్, ఉప సర్పంచ్ వరలక్ష్మి,రామాంజనేయులు, బూత్ కమిటీ అధ్యక్షుడు ఎగిరే శేట్టి యాదగిరి,గ్రామ నాయకులు పొందు మందమల్లారెడ్డి,నాగోజు శివచారి ఏమ్మా ఐలేను బద్దుల వీరయ్య,బత్తుల శ్రీశైలం బత్తుల కృష్ణయ్య, వెంకటేష్ నాయక్, నాగోజా శ్రీకాంత్, నేదునూరి శ్రీశైలం,నరహరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రధాని మోడి హయంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

**పెద్దేముల్, జులై 2, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడి హయంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు సందీప్‌కుమార్ అన్నారు.మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్‌లో గడప గడపకు బిజెపి కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ నిరంతరం దేశాభివృద్ధి కోసం బిజెపి పనిచేస్తోందని గుర్తుచేశారు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోందని, కాని తెలంగాణ ప్రజలు రాబోవు రోజుల్లో బిఆర్ఎస్‌ను ఓడించి, బిజేపిని అధికారంలోకి తెవడానికి సిద్దంగా ఉన్నారని అన్నారు. సుస్థిర పాలన అందించడం బిజెపికే సాధ్యమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సాయి రవిందర్, గోపాల్,జిల్లా బిజెవైఎం కార్యదర్శి గొబ్బురు రమేష్, సాయి, జనార్ధన్, రాము, నరేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘ కార్యాలయ భవన ప్రారంభోత్సవ దృశ్యం

## మొండి గౌరెల్లిలో ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభం

**యాచారం, జులై 2 ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనాన్ని తీగల దశరథ అధ్యక్షతన ఆదివారం గ్రామ సర్పంచ్ బండిమీద కృష్ణ రిబ్బన్ సంఘ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ముదిరాజ్ సంఘ కులస్తులు భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాభివృద్ధి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముది రాజ్ సంఘం సభ్యులు మేకల యాదయ్య, తెరటి భరత్‌కుమార్, భిక్షపతి, మాదం జంగయ్య, గుడాల వెంకటేష్, ఎంపిటిసి తాండ్ర లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ మేకల యాదగిరిరెడ్డి, వార్డు సభ్యులు మొగిలి అంజమ్మ వెంకటరెడ్డి, ఎట్టి లక్ష్మయ్య, కుంటి రేణుక పాండు యాదవ్, గ్రామ పెద్దలు కొలను మల్లారెడ్డి, గుర్రం శేఖర్‌రెడ్డి, తాండ్ర రవీందర్, గోదుకొండ్ల ప్రవీణ్, కట్టల కృష్ణయ్య, సంఘం సభ్యులు కృష్ణయ్య, మాదం బుచ్చయ్య, బాలయ్య, యాదయ్య, పెద్దమ్మ యాదయ్య, పాండు, యారా శ్రీను, మహేష్, జగన్, రమేష్, యాదగిరి, శేఖర్, కర్నాటి నరేష్, సంఘం మధు, శ్రీకాంత్, మేకల శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శంకర్‌పల్లి, జులై 02 ప్రభాతవార్త:** టిప్పర్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పిఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ సంతోష్ రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి పట్టణానికి చెందిన జొన్నాడ అనిల్ గౌడ్ (30) రోజు మాదిరిగా వ్యాపార పని కోసం రామాంతపూర్ వెళ్లాడు. ఇంటికి తిరుగు ప్రయాణంలో ఉండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో అనిల్ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## విప్లవ కవి రాజును స్మరించుకోవడం స్పూర్తిదాయకం: మాజీ ఎమ్మెల్యే




విప్లవ కవి చెరబండరాజు వర్థంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 2, ప్రభాత వార్త:** దిగంబర కవులలో ఒకరిగా విప్లవ కవిగా ఎన్నో రచనలు చేసిన గొప్ప వ్యక్తి చెరబండరాజుయని మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్‌లో విప్లవకవి అయిన చెరబండరాజు 44 వ వర్థంతి వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పాల్గొని చెరబండరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెరబండరాజు స్వంత గ్రామం అయిన అంకుశాపూర్‌లో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వర్థంతి వేడుకలు జరుపుకున్నారు. విప్లవకవి అయిన చెరబండరాజు అసలు బద్దం బాస్కర్ రెడ్డియని తెలిపారు. బాస్కర్ రెడ్డి చరిత్ర అందరికి తెలియజేయడానికి గ్రామంలో విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తుంటే కొందరు వ్యక్తులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ జర్నలిస్టు పిట్టల శ్రీశైలం, బంటు వెంకటేష్, జీవన్‌రెడ్డి, చెరబండరాజు కుటుంబ సభ్యులు బద్దం మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, మాధవరెడ్డి, బార్గవ రెడ్డి, నాయకులు చిలకగణేశ్, మేడబోయిన గణేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## పోతాయిపల్లిలో 15వ వార్డు కాంగ్రెస్ కమిటీ నియామకం

**శామీర్‌పేట, జులై 2, ప్రభాతవార్త**

పోతాయిలపల్లి గ్రామంలో (15వ వార్డు) కాంగ్రెస్ కమిటీని నియమించినట్లు తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలో కాంగ్రెస్ వార్డు కమిటీ నియామకం కోసం కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగ చింతల బల్వంతరెడ్డి, ఉపాధ్యక్షులుగ చింతల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగ పండాల కిరణ్‌గౌడ్, కార్యదర్శిగ జలగం నాగేశ్, కోశాధికారిగ బొల్లబోయిన నర్సింహ్మాయాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగ చింతల మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగ కూరాకుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగ కటికం రాజుచారి, కార్యదర్శిగ బత్తుల మహేందర్, కోశాధికారిగ చింతల మదన్‌మోహన్‌రెడ్డి, ఓబిసి సెల్ అధ్యక్షులుగ బి.రాజుయాదవ్, ఉపాధ్యక్షులుగ జి.శ్రీకాంత్‌చారి, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులుగ జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగ నల్ల కృష్ణలను నియమించినట్లు బి.జైపాల్‌రెడ్డి తెలిపారు. తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డితో పాటు 4వ వార్డు కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీరాల యాదగిరి, గూడురు మోహన్‌రెడ్డి, కార్యదర్శి మురళీగౌడ్, కోశాధికారి నర్సింహ్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.హరిగోపాల్, ఓబిసి ప్రధాన కార్యదర్శి టి.దర్శన్‌గౌడ్, నాయకులు సి.రాంచందర్‌యాదవ్, ఎం.మల్లేశ్‌యాదవ్, దుర్గయ్య, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, గోవర్దన్‌రెడ్డి, ఎన్.మహేందర్, గౌత మ్‌గౌడ్, ఎం.నరేశ్, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నూతన కమిటీ వారు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయటానికి కృషి చేయాలని నాయకులకు బి.జైపాల్‌రెడ్డి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు



మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న సన్‌రైజ్‌చారిటబుల్ ట్రస్టు సభ్యులు

## పేదకుటుంబానికి సైన్‌రైజ్‌ట్రస్టు ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, జులై 2, ప్రభాతవార్త:** అనాధలను ఆదుకొని అండగా ఉండేందుకు తమ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని సన్‌రైస్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు వై. సుందర్‌రావు అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన కాసోజ్ సాయికుమార్ 2017 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆదివారం ట్రస్టు ద్వారా ఆర్థికసాయం చేశారు. మృతునికి నలుగురు కూతుళ్లు, కుమారుడు ఉండగా పోషించడం అతని భార్య నీరజకు భారంగా మారిన విషయాన్ని తెలుసుకున్న సైన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు వచ్చి ఆమెకు రూ.10 వేల చెక్కును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. బాధితురాలు నీరజ మాట్లాడుతూ తన భర్త 6 సంవత్సరాల క్రితం చనిపోవడంతో తాను, తన పిల్లలు అనాధలుగా మారిపోయమని వాపోయారు. పిల్లల్ని పోషించడం కాగా నలుగురు కూతుళ్ల వివాహాలు చేయడం కష్టంగా ఉందని దాతలు ముందుకు వచ్చి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో సైన్‌రైజ్ చాటరిటబుల్ ట్రస్టు సభ్యులు అవ్వావరి సత్యం, అల్వా వీరారెడ్డి, దేవేందర్, శరబండి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీలో రాజీనామాల పర్వం

**ఘట్‌కేసర్, జులై 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. ఈమేరకు ఆదివారం ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో ఇద్దరు నాయకులు తమ పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ ఎస్‌సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ తోక రాజు, వైఎస్ ప్రెసిడెంట్ కడుపోల్ల మధులు రాజీనామా పత్రాలను విలేకరులకు చూపించారు. ఘట్‌కేసర్‌లో రైల్వేగేటుపై నిర్మిస్తున్న ఆర్ఓబీ పనులు చేయడంలో తీవ్ర జాప్య ం జరుగుతుందని మంత్రి మల్లారెడ్డి నిర్లక్ష్యంతోనే నిర్మాణం పూర్తి కావడం లేదని, అధికార పార్టీలో ఉన్నా ఏలాంటి పనులు కాకపోవడంతో పార్టీ నుంచి వైదొలుగుతున్నామని వారు పేర్కొన్నారు.

## 18 గుంటల భూమి కబ్జా ... మా భూమి మాకు ఇప్పించండి

**శంకర్‌పల్లి, జులై 02 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 508 బై ఈ భూమిలో 18 గుంటల భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిని తమ కుటుంబానికి అప్పగించాలని ఆ గ్రామానికి చెందిన ధరణి రాములు అధికారులను కోరారు. దొంతంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ భానుర్ కృష్ణారెడ్డి, రాజిరెడ్డిలు తన 18 గుంటల భూమిని ఆక్రమించుకుని దున్నుకుంటున్నారని తెలిపారు. ఈ విషయమై కోర్టుకు కూడా వెళ్లానని అన్నారు. మోకిలా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగడం లేదని, పైగా పోలలీసులు తమను దబాయిస్తున్నారని ఆరోపించారు. ఈ సర్వే నెంబర్‌లో మొత్తం ఆరు ఎకరాల గుంట భూమి ఉందని అన్నారు. భానుర్ కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, పట్నం రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు 1.20 గుంటల భూములు ఉండగా తనకు ఎకరా రెండు గుంటల భూమి మాత్రమే ఉందని ధరణి రాములు వాపోయారు. మిగిలిన 18 గుంటల భూమి వీరి కబ్జాలోనే ఉందని అన్నారు. ఈ విషయంలో పోలీసు అధికారులు తమకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

## వంతెన నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**శంకర్‌పల్లి, జులై 02 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలం మోకిల నుంచి టంగుటూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో మూసీవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అంతేకాకుండా వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కూడా పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, సర్పంచ్ గోపాల్, బిఆర్ఎస్ నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్, లింగం పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

**ఇబ్రహీంపట్నం, జులై 2, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం భోదిస్తున్న అధ్యాపకురాలు పోగుల విజ యలక్ష్మికి ఉస్మానియ విశ్వవిద్యాలయలంనుండి ఆంగ్ల సాహిత్యం లో డాక్టరేట్ పట్టా పొందారు.డాక్టరేట్ పొందిన విజయలక్ష్మికి కళా శాల ప్రిన్స్‌పాల్‌తో పాటు తోటి ఆధ్యాపకులు,సిబ్బంది అభినం దనలు తెలిపారు.

## వివాహిత అదృశ్యం

**మొయినాబాద్, జులై 2 ప్రభాతవార్త:** తన కుమార్తె అల్లుడితో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వినోద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామానికి చెందిన ఆవుల ఎల్లమ్మ తన కుమార్తె విజయలక్ష్మి (28) అల్లుడు రాజేష్‌తో గొడవ పడి ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చుట్టుపక్కల, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కనిపించకుండా పోయిన విజయలక్ష్మి నీలం రంగు చీర, బూడిద రంగు జాకెట్ వేసుకుని ఉందని, చామన చాయ ఉంటుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

## అన్ని పార్టీలు బిసి అభ్యర్థులనే నిలపాలి : జగన్ గౌడ్

**శంషాబాద్ జులై2,ప్రభాతవార్త :** బిసి నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ నియోజకవర్గాలలో అన్ని రాజకీయ పార్టీలు బిసి అభ్యర్థులను రంగంలో దింపాలని బిసి సంక్షేమ సంఘం నాయకుడు చింతల దిండు జగన్ గౌడ్,ఘాన్సి మియా గూడ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుగ్గిళ్ల రామనాథ ముదిరాజ్ ,స్థానిక గ్రామపంచాయతీ సభ్యుడు యువజన నాయకుడు నీరటి నరేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.ఆదివారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొన్ని రాజకీయ పార్టీలు బిసిలను అణిచివేసే ఉద్దేశంతో అగ్రకులాల వారిని బడా బాబులను రంగంలోకి దింపాలని కుట్రలు పన్నుతున్నాయని ఇది మంచి పద్దతి కాదని సూచించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రాజేంద్రనగర్ ,షాద్ నగర్ నియోజకవర్గం బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రకాష్ గౌడ్ అంజయ్య యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని వివరించారు. బిసిలను గౌరవించే ఇతర రాజకీయ పార్టీలు కూడా బిసి వర్గానికి చెందిన అభ్యర్థులను రంగంలోకి దింపాలని తద్వారా చట్టసభలలో బిసిల ప్రాతినిధ్యం తగ్గకుండా ఉంటుందని పేర్కొన్నారు. బడ వ్యాపారవేత్తలు అగ్రవర్ణాల వారిని రంగంలోని దింపి బిసిలను ఓడించే ప్రయత్నాలను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు.అన్ని రాజకీయ పార్టీలు కూడా బిసిలకు సముచిత స్థానం కల్పించాల్సి న అవసరం ఉన్నదని చట్టసభలలో బిసిల ప్రాతినిధ్యం రోజురోజుకు తగ్గిపోతున్నందున ప్రజలు చైతన్యవంతులై బిసి నాయకులకు పట్టం కట్టాలని జగన్ గౌడ్ రామనాథ్ ముదిరాజ్ నరేష్ ముదిరాజ్,పిలుపునిచ్చారు.చట్టసభలలో బిసిలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు లేనందున కుట్రలు పని ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుయుక్తులు పన్నుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి జులై2,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన చంద్రమ్మ మరణించడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటూ అంత్యక్రియుల 3వేల రూపాయలను ఆర్థిక సాయం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తిక్కల వెంకటయ్య,మాజీ హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నర్సింలు గౌడ్,మైలపురం రాములు ,తిక్కల యాదయ్య,తిక్కల జంగిలి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో మారుతున్న పల్లె పట్టణ రూపురేఖలు

**-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్,జులై 2ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణా రాష్ట్రంలోని తండాలు,పల్లె పట్టణ రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని మూడు మామిళ్ళ తండా గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు గత పాలకులు తండాల అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదని, అలాంటిది సీఎం కేసీఆర్ తండాలను గ్రామపంచాయతీలుగా చేస్తు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు తండాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా,విద్యుత్ సమస్యలను తొలగించడం జరిగిందన్నారు.అంతేగాక మన పాలన మనకే అంటూ పల్లె,పట్టణ ప్రగతి కార్యక్రమాలతో తండాలు,పల్లెలు,గ్రామాలు,పట్టణాల అభివృద్దికి కృషి చేయడం జరుగుతుందన్నారు.సీఎం కేసీఆర్ పాలనలోనే తండాలు పల్లె పట్టణ రూపురేఖలు మారుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమిభాయి,పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణు వర్ధన్‌రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ శేరినారాయణరెడ్డి,దేశ్యానాయక్,టీటీ.రాముునాయక్,ఎంపీటీసీ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### నవీన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటా

బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి మృతిచెందిన నవీన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.ఆదివారం రేగడి మైలారంలోని నవీన్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి అధైర్యపడవద్దని అదుకుంటామని అండగా ఉంటామని భరోసాకల్పించారు.

# కెసిఆర్, కెటిఆర్‌ల సహకారంతో ఎల్‌బినగర్ నియోజకవర్గాన్ని దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 2 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వనస్థలిపురం డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్‌గుప్తా అధ్యక్షతన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల సంక్షేమ సంఘాల ఆత్మీయ సమావేశం (నాగార్జునకాలనీ, క్రిస్టియన్ కాలనీ, హస్తినాపురం ఫేస్ 1,2,3, రాజిరెడ్డినగర్, వెంకటరమణకాలనీ వెస్ట్, న్యూ వెంకటరమణకాలనీ, శ్రీ వెంకటరమణకాలనీ, ఓంకార్‌నగర్, శక్తినగర్, రేడియో కాలనీ, శ్రీనివాసపురంకాలనీ, శ్రీ శ్రీనివాసపురం కాలనీ, ఇంజనీర్స్ కాలనీ ఫేస్ 1,2, యశోదనగర్ ఫేస్ 1,2,3,ఎఫ్‌సీఐ) కాలనీ వారిచే సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు ఆయనను సన్మానించారు. గతంలో ఎల్‌బినగర్ పరిసర కూడలిలో ట్రాఫిక్ విషయంలో నరకయాతన అనుభవించేవారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అభివృద్ధి విషయంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ రూపురేఖలు మరిపోవడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో వార్డు కార్యాలయలు నెలకొల్పడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు కాలనీవాసులు పలు సమస్యలను తెలిపారు. దానిలో భాగంగా లోవోల్టేజ్ సమస్యలు, అంతర్గత రోడ్స్, డ్రైన్స్, సీ.సీ. కెమెరాలు, కరెంటు స్తంభాలు, మంచినీటి సమస్య, నూతన ట్రాన్‌ఫార్మర్స్, ప్లే పార్కులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మన ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని ఇంకా ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉందని గుర్తు చేశారు. దాదాపు అన్ని కాలనీల రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. దెబ్బతిన్న బి.టీ., సీ.సీ.రోడ్ల స్థానంలో నూతన రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. గతంలో సీ.సీ.కెమెరాల కోసం మా కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన వారి అందరికి తప్పకుండా సీ.సీ.కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మంచినీటి సమస్య ఎక్కడ ఉందో గురించి పరిష్కారం చేస్తామన్నారు. నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు, అన్ని కాలనీ వాసులకు డ్రైన్స్ సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామన్నారు. అదే విధంగా ఎల్.బి.నగర్ నుంచి హయత్‌నగర్‌వరకు మెట్రో నిర్మాణం కూడా చేస్తామని సిఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ఛైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, మధుగౌడ్, వేములయ్యగౌడ్, చాపల శ్రీనివాస్, ఖైసర్, పి.వీ.రావు, ఆనంద్‌రాజ్, పద్మ, అజయ్, గడాల రాజు, పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంగూడ సమస్యల పరిష్కారం కోసం ఒత్తిడి తెస్తాం : అందెల



గడప గడపకు బిజెపి కార్యక్రమం నిర్వహిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో కాలనీలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఇక్కడి ప్రజలు డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యలతో ఇబ్బందులు పడుతుండడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని మహేశ్వరంనియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ విమర్శించారు. ప్రధాని మోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల ప్రచార నిమిత్తం చేపట్టిన మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో గుర్రంగూడలోని 6,7 డివిజన్లలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో గడప గడపకు బిజెపి నినాదంతో ఇంటింటికి తిరిగి స్థానికులను కలిసి కేంద్ర సంక్షేమపథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అయితే స్థానికులు తమ కాలనీలకు సరైన డ్రైనేజీ ఔట్‌లెట్ లేదని ఆయన దృష్టికి తెచ్చారు. అదే విధంగా వివిధ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ మేరకు స్పందించిన ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గుర్రంగూడ కాలనీల్లో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య తీరేంత వరకు బిజెపి అండగా ఉండి పాలకులపై ఒత్తిడి తెస్తుందని హామీనిచ్చారు. కాగా అందెల గడప గడపకు బిజెపి కార్యక్రమం టీచర్స్ కాలనీ, శ్రీ లక్ష్మినగర్, మాట్రిక్స్ కాలనీ, ఎస్‌బిఆర్ కాలనీ, రాజ్యలక్ష్మినగర్, సాయిదుర్గనగర్, ఓల్డ్ విలేజ్, జిబిఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, ఆదిత్యనగర్, బాలాజీ హోమ్స్ జక్కిడి ఎన్‌క్లేవ్, సాయిహోమ్స్ కాలనీ, సావిత్రమ్మ కాలనీ, జెఎస్‌ఆర్, శ్రీరాం కాలనీల గుండా సాగింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రల్లో గుర్రంగూడ మాజీ పర్సన్ ఇంఛార్జి జక్కిడి జంగారెడ్డి, సీనియర్ నాయకులు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, జక్కిడి సురేందర్‌రెడ్డి, వివిధ డివిజన్ల బిజెపి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మం జన గర్జన సభకు తరలి వెళ్లిన చైతన్యపురి కాంగ్రెస్ నేతలు

**ఎల్.బి.నగర్, జూలై 2 ప్రభాతవార్త :** ఖమ్మం జిల్లాలో జరిగిన కాంగ్రెస్ జన గర్జనసభకు చైతన్యపురి కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. డివిజన్ సీనియర్ నాయకుడు యరమల రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చైతన్యపురి చౌరస్తా నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుకునూరు శశిధర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. యువజన కాంగ్రెస్ నేతలు మన్యం వాసుదేవ రెడ్డి, దేవిడి రాజేందర్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, ప్రణీత్, సూర్య తేజ, కౌశిక్, సందీప్ తదితర నేతలు భారీ ర్యాలీగా జనగర్జన సభకు తరలి వెళ్లారు. సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్‌ఎస్ పార్టీ చైతన్యపురి నేతలు కాంగ్రెస్ తీర్థం ఉంచుకోనున్నారని శశిధర్‌రెడ్డి వెల్లడించారు.

# ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే మంచిరెడ్డి



ఎమ్మెల్యే మంచిరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించిన నాయకులు

**తుర్కయంజాల్, జూలై 2 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 19వ వార్డు శ్రీశ్రీ నగర్ కాలనీలో డ్రైనేజీ మరియు కమ్యూనిటీ హాల్ కోసం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నివాసానికి గౌనీ వినోద్‌గౌడ్, మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, 19వ వార్డ్ అధ్యక్షులు రాయబండి శ్రీకాంత్‌చారి, జనరల్ సెక్రెటరీ తావుల శ్రీనాథ్‌తో కలిసి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, సిసి రోడ్లు, మిషన్ భగీరథ మంచినీళ్లు ఇంటింటికి వచ్చేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గోరుగంటి జగన్, పల్లపు శ్రీనివాస్, బొమ్మరాజు, అశోక్, రాయబండి వేణుగోపాలచారి, నిమ్మల రాఘవేందర్‌గౌడ్ ,19వ వార్డ్ బిఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు తావుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి దిశగా తెలంగాణ రాష్ట్రం : హోంమంత్రి మహమూద్ అలీ



హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో చేరిన మహిళలు, నాయకులు

**మలక్‌పేట, జూలై 2 ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. అజంపుర బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు రజా అలీ మీర్జా, నర్గీస్ భానుల ఆధ్వర్యంలో 119 మంది మహిళలు, నాయకులు హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది. సిఎం కెసిఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దేశంలోనే నెంబర్ సిఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా రాష్ట్రం నిలుస్తుందన్నారు. సిఎం కెసిఆర్ అన్ని సెక్టార్లను అభివృద్ధి చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి లాయఖ్ అలీ, ఫాతిమా, నదిరా, నస్రీన్‌బేగం, నుసరత్ ఫాతిమా, అక్బర్ లీ, సాజిద్ అలీ, అబ్బాస్ హుస్సేన్, అక్రం అలీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, జూలై 2 ప్రభాతవార్త :** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్‌లో కొత్తపేట డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్ అధ్యక్షతన డివిజన్ పరిధిలోని పలు కాలనీల సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. బస్తీల్లో కుక్కల బెడద ఉందని, అవసరమున్న చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గన్నీ ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రణాళిక రూపొందించి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, మహేష్ రెడ్డి, జోగు రాములు, ఉదయ్ గౌడ్, దీప్ లాల్, మల్లెపాక యాదగిరి, యాసిన్, పాండు గౌడ్, జోగు నగేష్, ఇటికల యాదగిరి, వరుణ్ చంద్ర పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా విజయరంగ



కార్యక్రమంలో పాల్గొన్న విజయ రంగా తదితరులు

**ఎల్.బి.నగర్, జూలై 2 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ డాక్టర్ బి.విజయరంగ జోన్ చైర్మన్‌గా నియమిస్తూ గవర్నర్ లక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయరంగ మాట్లాడుతూ నిరంతరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. సమాజానికి సేవలు అందించేందుకు నాలుగు క్లబ్బులను సమన్వయ చేసుకోవాలని సూచించారు. ఉచిత క్యాన్సర్, కంటి, సాధారణ హెల్త్ క్యాంప్స్ పెద్ద ఎత్తున నిర్వహించామన్నారు. సేవే పరమావధిగా తాము కార్యక్రమాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

# నాటా సమావేశంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ నాయకులు

**మలక్‌పేట, జూలై 2 ప్రభాతవార్త :** యుఎస్‌ఎ డల్లాస్‌లో జరిగిన నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సమావేశంలో మలక్‌పేట నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇంఛార్జి ఆజం అలీ, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి ప్రవాస భారతీయులను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆజం అలీ మాట్లాడుతూ తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రజల సంక్షేమంకోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. సిఎం కెసిఆర్ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాటా బోర్డు ఆఫ్ డైరెక్టర్ మురళీవెంకటరమణారెడ్డి, చిముల్ల ప్రవర్ధన్‌రెడ్డి, కల్వల విశ్వేశ్వర్‌రెడ్డి, స్వప్న, ధర్మేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన : మంత్రి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

**జవహర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త :** తన గొంతులో ప్రాణం ఉన్నంతవరకు జవహర్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 3, 4, 6, 7, 8, 18, 21, 26 డివిజన్లో 8 కోట్ల 10 లక్షల రూపాయలతో నిర్మాణాలు చేపట్టనున్న సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంత్రి మల్లారెడ్డి మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, ఆయా డివిజన్లో కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రాణం ఉన్నంతవరకు జవహర్‌నగర్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. జవహర్ నగర్ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ఇందులో భాగంగానే జవహర్‌నగర్‌కు 25 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారికి జవహర్‌నగర్‌వాసుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో జవహర్ నగర్‌కు ప్రత్యేక అవార్డు వచ్చేటట్లుగా అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. జవహర్ నగర్ ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. జవహర్‌నగర్ అభివృద్ధికోసం ఇప్పటికే 130 కోట్లు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. జవహర్‌నగర్‌లో ఏ డివిజన్లో చూసినా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు వెచ్చించి సమస్యలు లేని కార్పొరేషన్ గా చేయడమే తన లక్ష్యమన్నారు. ప్రతి ఆదివారం జవహర్‌నగర్‌లో పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించుకుందామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అంతకుముందు మంత్రికి డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బతుకమ్మలు, బోనాలు, కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. 8 వ డివిజన్లో బిఆర్‌ఎస్ నాయకుడు కొమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు భాషవాని కొండల ముదిరాజ్, పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓట్లు వేసిన ప్రజలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం : సామ

**వనస్థలిపురం, జూలై 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ మహాజన్ సంపర్క్ అభియాన్ భాగంగా బీజెపి ఇంటింటి కార్యక్రమాన్ని హస్తినాపురం డివిజన్లో సంతోషిమాత కాలనీ, హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్, ద్వారకా తిరుమలకాలనీ, భాగ్యనగర్ కాలనీ ఫేస్-1, ఫేస్-2, కస్తూరి కాలనీ సాయి తిరుమల, సాయినగర్ అయోధ్యకాలనీ, కృష్ణనగర్ కాలనీలలో బిజెపి అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన అందిస్తూ, ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా ఇళ్ళు లేని పేదలకు ఇళ్ళు ఇవ్వాలని దేశంలో పట్టణాలలో, గ్రామాలలో, 3 కోట్లకు పైగా మంజూరు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు పేదవాని ఆత్మగౌరవమని ఇళ్ళులేని పేదలకు ఇళ్ళు కట్టిస్తామని మానిఫెస్టోలో పెట్టామని అది నమ్మిన పెద్ద ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రారంభోత్సవాల పేరిట హడావిడి చేసారుతప్ప... పేదవాళ్లకు ఇళ్ళునిర్మించకుండా మోసం చేశారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు కేటాయించిగాని రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇళ్ల నిర్మాణానికి కలపకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు వెనక్కి పోయాయన్నారు. ఎల్.బి నగర్‌లో ఇళ్లలేని పేదలు 70 వేలకు పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఎల్.బి నగర్ ఎంతమందికి ఇళ్ళు నిర్మించారో చెప్పాలన్నారు. కేవలం గొప్పలు చెప్పుకోవడంతప్ప ఒరగ పెట్టిందేమి లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ఈ మధ్యకాలంలో డబల్ బెడ్ రూముల దరఖాస్తుదారుల అప్లికేషన్లను రివ్యూ చేస్తున్నామని మరొక నాటకాన్ని తెర లేపారన్నారు. ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దింపడం బీజేపీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నరేష్‌యాదవ్, అమరేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, మాధవరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, సాయి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు బిజెపి కార్యక్రమం నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

# రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికిన చిలుక



రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 2 ప్రభాతవార్త :** ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ చేపడుతున్న తెలంగాణ జన గర్జన కార్యక్రమానికి బయలు దేరి వెళుతున్న టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డికి పెద్దఅంబర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఆయనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి అనంతరం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికిన అనంతరం ఖమ్మం సభకు బయల్దేరి వెళ్లారు. అదే విధంగా రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన స్వగృహంలో రేవంతన్నతోపాటు చిలుక మధుసూదన్‌రెడ్డి కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కిషోర్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, జైహింద్, ప్రవీణ్, రాకేష్‌రెడ్డి, యూనుస్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

**కుషాయిగూడ, జూలై 2 ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ మార్కెట్ వెనక నివాసముండే రమేష్ కళ్యాణిల కూతురు తన్విత (4) శనివారం మధ్యాహ్నం భోజనం చేసి చిన్నారిని పడుకోబెట్టిన అనంతరం ఎంత లేపిన లేవకపోవడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు తన్విత ఎలా మృతి చెందింది అనే విషయాన్ని తెలుసుకోవడానికి పోలీసులు మృత దేహాన్ని పోస్ట్‌మార్టం పంపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విశ్వబ్రాహ్మణ సభ్యునికి రూ.35 వేల సాయం

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** ఉద్యోగరీత్యా పని చేస్తున్న సమయంలో దాడికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాదర్‌గుల్ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ సభ్యుడు రాధారపు భరత్‌చారికి విశ్వబ్రాహ్మణ నాయకులు రూ.35 వేల ఆర్థిక సాయం అందించారు. ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న సాయినగర నివాసి భరత్‌చారి ఇటీవల ఓ వ్యక్తి చేతిలో దాడికి గురై గాయపడ్డాడు. అయితే ఇంటి వద్ద ఉంటున్న అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలుసుకున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు చారిని పరామర్శించి రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకారణంగా చారిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి, వేములకొండ జంగాచారి, గన్నోజు రాజుచారి, రాధారపు సురేష్‌చారి, శ్రీహరిచారి, బ్రహ్మచారి, సోమచారి, విద్యానందచారి తదితరులు పాల్గొన్నారు.

# జనప్రియ హోమ్స్‌లో గోరింటాకు పండుగ



గోరింటాకు వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

**వనస్థలిపురం, జూలై 2 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట, జనప్రియహోమ్స్ కాలనీలో ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. జనప్రియ హోమ్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రాంగణంలో మహిళలు సమావేశమై, గోరింటాకును తయారు చేసుకుని ఒకరినొకరు చేతులకు గోరింటాకును పెట్టుకున్నారు. సాంప్రదాయబద్ధంగా మహిళలు ఒకచోట చేరి గోరింటాకు పెట్టుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలు మిఠాయిలు పంచుకుని సంతోషం వ్యక్తం చేసారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎళ్లవేళలా మహిళలకు సహకరిస్తున్నందులకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లవి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, సీతమ్మ, లక్ష్మి, మంగళ, జ్యోతిసాయి, జయశ్రీ, యోగిత, శైలజ, జయంతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అన్నదాన కార్యక్రమం

**ఎల్.బి.నగర్, జూలై 2 ప్రభాతవార్త :** రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వద్ద రోగుల సహాయకులు, అనాథల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నో ఫుడ్ వేస్ట్ సామాజికవేత్త శ్రీధర్‌రెడ్డి, గోల్డ్ మ్యాన్ స్మార్ట్ వకోడే, ఎండి వి 1 ఫెసిలిటీ సర్వీస్ సభ్యులు శ్రీకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ యువత కమిటీ అధ్యక్షులు శివనేత, కోఆర్డినేటర్ ప్రవీణ్, చైతన్య, నవీన్, సాయి, మోహన్, నితిన్, గణేష్, లక్ష్మణ్, నాయుడు పాల్గొన్నారు. నేను సైతం సమాజం కోసం అంటూ ప్రతి ఆదివారం జరిగే ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అవసరమైన వారికి చేయూతని అందించాలని ప్రతినిధులు పేర్కొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో భారీగా యువకుల చేరిక



కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**మన్సూరాబాద్, జూలై 2 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్‌కు సంబంధించిన పలువురు యువకులు పెద్ద ఎత్తున భారాస పార్టీలో చేరిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ భారాస పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి యువత ఇట్టి పార్టీలో చేరిక కావడం జరిగింది అని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రధాన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు, సాధించుకున్న తెలంగాణలో అన్నిరంగాల్లో గొప్పవిజయాలను పార్టీ సాధించిందని తెలిపారు. గడిచిన సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అద్భుతాలు సాధించింది. విజయాల దిశగా దూసుకెళ్లింది. మంచినీరు, సాగు నీరు, సంక్షేమం, విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో గొప్ప విజయాలు అందుకుంది.

బిఆర్‌ఎస్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీష్‌యాదవ్, రాంకోటి, చేరికైన వారిలో శశిధర్, కన్నా, జానీ, సురేష్, వినోద్, మణి, అంజి, వెంకట సాయి,శ్రీకాంత్, కిషోర్, సోమన్న, కరుణాకర్ రెడ్డి, మల్లికార్జున్, సుధీర్, శివతో పాటు 100 మంది యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ బాల్ క్రీడలో సత్తా చాటిన పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు

**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** హర్యానాలో గత నెల 24 నుండి 28వ తేదీ వరకు జరిగిన జూనియర్ టార్గెట్ బాల్ పోటీలలో బాలుర జట్టు, మిక్స్‌డ్ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. క్రీడాకారులు తిరిగి మన రాష్ట్రానికి చేరుకున్న సందర్భంగా తెలంగాణా టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వారికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు భువన కృతి, కనిష్కరెడ్డి, శ్రీనేత్ర, సిరివల్లిక, అశ్విక, అక్షయ, సాయి వైష్ణవ్, విఘ్నేష్, సాయి షణ్ముఖ, వరుణ్ బహర్గవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రేవంత్, కోచ్ పి.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథాశ్రమ బాలలకు పుస్తకాల పంపిణి

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** నాదర్‌గుల్ సమీపంలో ప్యారం విజయ భారతి విద్యాసాగర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమ విద్యార్థులకు మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి మహిళా కన్వీనర్ ఇందుమతి పుస్తకాలను పంపిణీ చేశారు. అంబేద్కర్ ఆశయాలను దృష్టిలో పెట్టుకొని పుస్తకాలను పంపిణీ చేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్, యామిని, అరవింద్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.